# అత్తవారింటికి...

## కావిలిపాటి విజయలక్ష్మి

"దీపావళికి అమ్మాయిని అల్లుణ్ణి రమ్మని వ్రాయండీ!" నాలుగ రోజులై మా ఆవిడ ఒకటే నస "మొన్న దసరాకే కదటే వచ్చి వెళ్లారు" అని అన్నా ఆమె వినిపించు కోవటంలేదు.

మళ్ళీ అరుస్తూంది వంటింట్లోంచి, "వీధిలోకి వెళ్తున్నారు కాబట్టి అల్లుడికి ఓ కార్డు వ్రాసి పడెయ్యండి" అని. నాకు చిర్రెత్తుకు వచ్చింది.

"నేను వ్రాయను. దసరాకి వచ్చి జలుబు వదిల్చిపోయాడు. మళ్లీ 'దీపావళి'. దిక్కుమాలిన పండగలు, దిక్కుమాలిన ఆచారాలూను. పెళ్లి అయిన దగ్గరనుంచీ ప్రతి పండక్కీ పిలుపులే! చస్తూంటే" అన్నాను ఆమెకు వీధిలోంచి పెరటిలోకి వినిపించేంత గట్టిగా.

"మీరు ప్రతి పండగకి మా నాన్న పిలుపు లేకపోయినా పరుగెత్తుకు వచ్చేవారు కదటండీ!" అందావిడ, మాట సాగదీస్తూ.

"నోరుముయ్యి. ఆ రోజులు వేరు. ఈ రోజులు వేరు. మీ నాన్న నాకు పదివేలు కట్నం యిచ్చాడా? అయినా పాడీ, పంటా ఆస్తీ పాస్తీ వుండేవి. ఇప్పుడు అగ్రకులాల వాళ్లం పాతుకుపోయాం కదటే! అటు ఆస్తులూ లేవు, ఇటు ఉద్యోగాలూ మనకు అందుబాటులో లేవు. పైగా కట్నాల బెడద ఒకటి. అలాటప్పుడు ఇలాంటి ఆచారాలు వదులుకోవాలే" అని ఆమెకు నచ్చజెప్ప చూశాను. కాని లాభం లేకపోయింది. నన్ను విష్టురాలాడుతూ ఏడవటం ప్రారంభించింది.

సరే అని ఓ కార్డు వ్రాసి మా చిన్నబ్బాయిని పిలిచి పోస్టు చెయ్యరా అన్నాను.

"ఎవరికి నాన్నా?" అన్నాడు యధాలాపంగా.

"బావకి పండక్కి రమ్మని."

"ఇప్పుడు మళ్లీ ఎందుకు పిలుస్తారు నాన్నా! మళ్లీ బట్టలవీ...." అన్నాడు వాడు బాధగా నావైపు చూస్తూ. వాడు నాలుగు సంవత్సరాలక్రితం బి. ఎ. పాసయ్యాడు. ఉద్యోగం దొరక్క మనస్సు పాడయి వున్నాడు. నేను రిటైరయి సంవత్సరం దాటింది. ఇంట్లో సంపాయించే వాళ్లులేరు. నేనో దురదృష్టవంతుణ్ణి. పెద్దవాడు బి.ఇ. చదువుతానని ఇంటరు మీడియట్ శ్రద్ధగా చదివాడు. పరీక్షల రోజుల్లో జ్వరం పడిపోయాడు. అయినా ఆ జ్వరంలోనే చదివాడు. పరీక్ష వ్రాశాడు. ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు. బి.ఇ. సీటు వస్తుందని చాలా ఆశించాడు. కాని రాలేదు. ఆ రోజు నాకింకా జ్ఞాపకం. జ్ఞాపకమేమిటి? ఆ రోజు నేను జీవించి ఉన్నంతకాలం జ్ఞప్తిలోవుండి, నా గుండెను మండిస్తూనే వుంటుంది. అర్ధరాత్రి అందరం నిద్రపోయేవేళ పెరటి వరండాలో పడుకున్నవాడు ఏడుస్తూన్నట్లుగా అనిపించి, హఠాత్తుగా మెలకువ వచ్చింది నాకు. వాడి మంచం దగ్గరకు నడిచాను కంగారుగా. వాడి కళ్లు జ్యోతుల్లా వున్నాయి. ముఖం వుబ్బివుంది. వాడి కనుల్లో బాధ, నిస్పృహ, యత ఎవరిమీదో కసి ద్యోతకమవుతున్నాయి.

"ఎందుకు బాబూ! కడుపునెప్పా" అడిగాను. నా ప్రశ్నకి వాడు పకాల్న నవ్వాడు. ఆ నవ్వు చూసిన నేను భయపడ్డాను. వీడేమిటి ఇలా నవ్వుతున్నాడు? ఏమిటి ఆలోచిస్తున్నాడు? ఏంచేస్తాడు? అని.

"కడుపు నెప్పికి చిన్న పిల్లాడిలా ఏడుస్తానా నాన్నా! నా దగ్గర లెఖలు నేర్చుకున్న అర్జునుకి సీటు వచ్చింది బి.ఇకి. నాకు సీటు రాలేదు. వాడి మార్కులు ఫిఫ్టీపెరసంట్. నేను ఎయిటీ పెరసెంటు మార్కులతో ప్యాసయ్యాను. నేను బి.ఇ. చదివి ఇంజినీరుని అవ్వాలనుకున్నాను నాన్నా" అని భోరున ఏడ్చాడు. వాడిని చాలాసేపు ఓదార్చాను. డిగ్రీ కోర్సులో చేరమనీ, బాగా చదివితే ఏ చదువన్నా మంచి ఉద్యోగమే వస్తుందనీను. వాడు కస్సున లేచాడు" సీటు వచ్చింది. ఇహ ఉద్యోగం వస్తుంది. అదీ రాదు. ఈదేశం వదిలిపోతే మనలాటి వాళ్లకు బాగుంటుందేమో!" అని.

"పెద్దపెద్ద ఇంజనీర్లు, డాక్టర్లు, పిహెచ్‌డీలు పోతున్నారు మనలాటి వాళ్లం ఎలా వెళతాం బాబూ!" అని నవ్వాను నేను.

రెండు నిమిషాల తర్వాత నిర్లిప్తంగా శూన్యంలోకి చూస్తూ "మన మధ్యతరగతి వాళ్లం ఆశలు చంపుకుని బ్రతకటం చాతకాక పోతే వెళ్లవలసింది ఒకే చోటికి" అని నవ్వాడు వాడు.

ఆ నవ్వులో ఏదో తెగింపు ఉందనిపించి, "మనకి అందనివాటికోసం ఆశించి మనస్సు పాడుచేసుకోవటం అవివేకం. ఉన్నదానితో తృప్తిపొందటం లభ్యమయినదానిలో మది పెట్టుకోవటం మనిషి నేర్చుకుంటే సుఖపడతాడు నాయినా, నిద్రపో" అని వాడి జబ్బ మీద ఓదార్పుగా తట్టి నేనుపోయి మళ్లీ మంచంమీద పడుకున్నాను. ఎప్పుడు నిద్ర పట్టిందో తెల్లవారి మా ఆవిడ పనిమనిషి మీద వేసే కేకలు చెవినపడి మెలకువ వచ్చింది.

నా చేతికి కాఫీ గ్లాసు అందిస్తూ అడిగింది మా ఆవిడ. "రామం ఎటు వెళ్లాడండీ" అని. అంతే నా చేతిలోని కాఫీ గ్లాసు వదిలేశాను.

"అదేమిటండీ అలా వదిలేశారు" అందామె తెల్లబోయి నావైపు చూస్తూ. ఆమె మాట వినిపించుకోకుండా వీధిలోకి నడిచాను, రామాన్ని వెదకటానికి. ఏమైపోయాడో, ఎక్కడికి వెళ్లాడో ఇప్పటివరకు వాడేమిటయ్యాడో అస్సలు ఉన్నాడో చచ్చిపోయాడో తెలియదు. గుండె కోత పెట్టిపోయాడు. రామం జ్ఞాపకాలతో మనస్సు బరువెక్కింది. మళ్లీ మా ఆవిడ మాటలు వినిపించసాగాయి. ముద్దు ముచ్చట ఆడపిల్లకి తల్లి తండ్రీ వున్నప్పుడే జరుగుతాయి. తర్వాత ఏ ఊరి అన్నదమ్ములు? అయినా వాడికే బ్రతుకుతెరువు దొరకలేదు. వాడేం చూస్తాడు? పండక్కి అల్లుణ్ణి పిలవండి అనే సరికి ముఖం చిట్లించేసుకుంటారు. మీరు ప్రతి పండక్కీ పరుగెట్టుకువచ్చేవారు

కాదూ! మీకన్నా అల్లుడెంతో నయం పిల్లని అభిమానంగా చూసుకుంటాడు."

గాలి నావైపు మళ్ళిందని యెటన్నా ఆ హోరు తగ్గేవరకూ వెళ్ళిపోవాలని లేచాను. "పూలు తెచ్చారా అని అడిగితే ఇసడ పగలగొట్టారు. మీరో మనిషేమిటిలెండి" అంటూ ఆవిడ నిరసనగా నవ్వింది.

ఆమాట వినగానే నాకు పక్కున నవ్వొచ్చి నవ్వేశాను.

ముప్ఫయి సంవత్సరాల క్రితం అనుకుంటాను అప్పటికి నాకు ఉద్యోగ సద్యోగం లేదు. పోయిన ఎఫ్. ఏ చదివిన వాణ్ణి అనుకుంటాను. అప్పుడు మేం పార్వతీపురంలో వుండేవారం. మా అమ్మకి నేనే ఒక్కణ్ణే మగపిల్లవాణ్ని. నాకన్నా పెద్దది ఓ అక్క వుండేది. అక్క పురిటికని అమ్మ పార్వతీపురం వచ్చింది. అమ్మ యెక్కడవుంటే అక్కడే నేనూ వుండేవాణ్ని దీపావళి పండగకి రమ్మని మామగారి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. అమ్మ నాకు యెందుకు అంత తొందరగా పెళ్లిచేసిందో నాకిప్పటికీ అర్థంకాదు. నాకు ఉద్యోగం లేదు. మాకు పెద్దవెనక ఆస్తులేం లేవు. మామగారు ప్రతి పండగకీ రమ్మని వ్రాయటం, నేను వెళ్లటానికి ముందు సిగ్గుపడి తర్వాత వెళ్లటం ఆయన యిచ్చే పంచెలచాపు తెచ్చుకోవటం పరిపాటైపోయింది, పెళ్లయినరెండుసంవత్సరాలుంచీ. ఈ సంవత్సరం దసరాపండగకి మాత్రం అక్క వంట్లో బాగోలేదని వెళ్ళటం మానేశాను. దీపావళికి రమ్మని మామగారి పిలుపుకోసమే యెదురుచూస్తున్న నాకు సంతోషంగానే వుంది. విశాఖపట్నం వెళ్దామని, మా ఆవిణ్ని చూడాలని చాలా కోరికగా వుంది. ఏదేం చాదస్తమో నాకు ఉద్యోగం వచ్చేవరకూ భార్యను కాపురానికి తెచ్చుకోవటానికి వీల్లేదంటాడు బావ. అతను నాకన్నా వయసులో పెద్దవాడు పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. అతని మాట గౌరవించటం ధర్మంగా భావించి తల ఊపానే కాని నాకు మనస్సులో బావమీద కోపంగానే వుండేది. మామగారి ఉత్తరం చూపిన అమ్మ నాతో గుసగుసలాడింది డబ్బులు లేవురా టిక్కెట్టుకి, అటునుండి మామగారు ఇస్తారనుకో అని. 'పోనీ వెళ్లనులే' అన్నాను నేను నీరసంగా.

దీపావళి రేపనగా బావ అడిగారు 'విశాఖపట్నం వెళ్తావేమిటోయ్' అని.

నేను జవాబేమీ యివ్వలేదు. మౌనంగా తల వంచాను.

అతను నవ్వి, "నాకు తెలుసు నీకు వెళ్లాలనే వుంటుంది సరే రేపు కానిస్టేబుల్‌కి చెబుతాను టిక్కెట్టు అక్కరలేదు. వెళ్లు" అన్నారు.

మనస్సులోనే అతనికి దణ్ణం పెట్టాను. గబగబ సంచిలో రెండు జతల బట్టలు పెట్టుకుని ప్రయాణమయ్యాను. అక్క బావకి తెలియకుండా 'వుంచు' అని పదిరూపాయల కాయితం నా జేబులో పెట్టింది.

మా బావ పబ్లిక్ ప్రాసిక్యూటరు. అతనికి పలుకుబడి వుంది. టిక్కెట్టు లేకుండా అతనిచ్చే కానిస్టేబుల్ సాయంతో ప్రయాణం నాకు నిబ్బరంగా వుంది.

మేం ప్లాట్‌ఫారంమీద అడుగు పెట్టేసరికి రైలువచ్చేసింది. కానిస్టేబుల్ టి.టి.ఐ.తో చెబుతాను 'మీరు పెట్టెలో యెక్కి కూర్చోండి' అనిచెప్పి వెళ్లిపోయాడు. ప్లాట్‌ఫారం రద్దీగా ఉంది. రైలుపెట్టెలు జనంతో కిక్కిరిసి వున్నాయి. నాకు యెదురుగావున్న పెట్టె


# రంగు రంగుల దీపావళికి క్రొత్త క్రొత్త వెలుగులు

### డి. కామేశ్వరి రచనలు

| | |
|---|---|
| కోరికలే గుర్రాలైతే | 6-00 |
| ఇది జీవితం | 6-00 |
| అరుణ | 9-00 |
| విధివంచితులు | 7-50 |
| కొత్తనీరు | 7-50 |
| తల్లి మనసు | 5-00 |
| కన్నీటికి విలువెంత | 6-00 |
| తిరిగి దొరికిన జీవితం | 6-00 |
| పడగనీడ | 6-00 |
| శిక్ష | 4-50 |
| పరాజితులు | 7-50 |
| అతకని బతుకులు | 6-00 |
| వివాహబంధాలు | 6-00 |
| చీకటి తొలగిన రాత్రి | 6-00 |
| తీరం చేరిన నావ | 6-00 |
| వాన చినుకులు | 6-00 |

### రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనలు

| | |
|---|---|
| రాజు-మహిషి | 10-00 |
| అల్పజీవి | 6-00 |
| కలకంఠి | 4-00 |
| ఆరు చిత్రాలు | 4-00 |
| ఆరు సారా కథలు | 3-00 |
| రత్తాలు రాంబాబు (3 భాగాలు ఒక్కొకటి) | 7-50 |
| రత్తాలు రాంబాబు (4-వ భాగం) | 6-50 |

### ఆశాలత రచనలు

| | |
|---|---|
| పచ్చని కలశంలో | 6-00 |
| అరని పారాణి | 6-00 |
| స్పందన | 6-00 |
| ఈ సంఘం చెక్కిన శిల్పాలు | 6-00 |
| నీడల చాటున నిజం | 5-00 |
| మమతల వంతెన | 6-00 |

### తమిరిశ జానకి రచనలు

| | |
|---|---|
| వీడిన మబ్బులు | 6-00 |
| అందానికి సమాధి | 6-00 |
| మూగ మనసులు | 6-00 |
| జీవితచక్రం | 6-00 |
| బొమ్మలు | 6-00 |

### అన్వాద్ రచన

స్వాతి నవలల పోటీలలో రు. 3000 లు ప్రథమ బహుమతి పొందిన పూర్తి నవల

| | |
|---|---|
| చీకటోళ్ళు | 9-00 |

ప్రతులకు

## అరుణా పబ్లిషింగ్ హౌస్

ఏలూరు రోడ్ - విజయవాడ - 2 ఫోన్: 61181

కాస్త ఖాళీగా వుందనిపించి అందులో ఎక్కి కూర్చున్నాను.

ఇంజను మొర్రోమని అరిచి మూలిగి నెప్పులుపడుతూ కదిలింది. ఇళ్లు, చెట్లు చేమలూ వెనక్కి నడిచిపోతున్నాయి. జేబులో పది కాయితం తీసి ఓసారి చూసుకుని మళ్లీ జేబులో పెట్టుకున్నాను.

వాల్తేరు స్టేషనులో దిగి సంపెంగపూలు కొని మా ఆవిడకు తీసుకువెళ్లాలి. ఏమిటో సీతాలుకి సంపెంగ పూలంటే ఎంత ఇష్టం. బావ రెండురోజులుండి వచ్చెయ్ అన్నారు కాని వారం రోజులువుండాలి లేకపోతే 'సీతాలు' చిన్నబుచ్చుకుంటుంది. ఎందుకిన్నిరోజులు వుండిపోయావ్ అని బావ అడిగితే వంట్లో బాగోలేదని బొంకొచ్చు. నాకు ఉద్యోగం యెప్పుడు వస్తుందో 'సీతాలు' నేనూ చిలకా గోరింకల్లా యెప్పుడు కాపురం చేస్తామో!

సీతాలంటే నా భార్య, తనకు చేగోడీలు ఇష్టమని ప్రతి పండగకీ అత్తగారు చెగోడీలే చేస్తుంది. మా అత్తగారు 'దీపావళి' పండక్కి చేగోడీలు చేస్తుందని చెబితే అక్కయ్య కదిలి కదిలి నవ్వింది, 'చేగోడీలు' ఓ పిండి వంట ఏమిట్రా! బొబ్బట్లో, బూరెలో వండుతారు కానీ' అని బొబ్బట్లంటే నాకిష్టం. ఈ సారి చెప్పెయ్యాలి సీతాలుకి 'మీ అమ్మ నివ్వాళ బొబ్బట్లు చెయ్యమను' అని.

'టికెట్, టికెట్,' టి. టి ఐ. నా దగ్గరకొచ్చి నిల్చున్నాడు నా కమ్మని ఆలోచనలు చెడగొపేస్తూ రాక్షసుడిలా. అది గజపతి నగరం స్టేషను. రైలు యెప్పుడు ఆగిందో అతనెప్పుడు ఈ పెట్టెలోకి యెక్కి నా దగ్గర కొచ్చాడో నాకు తెలియదు.

"ఊ. టికెట్ ....టికెట్" మళ్లీ అన్నాడతను.

నా గుండె దడదడా కొట్టుకుంటూంది. కానిస్టేబుల్ ఏమయ్యాడని తిట్టుకుని దిక్కులు చూస్తున్నాను వాడు కనిపిస్తాడేమో అని.

"ఊ మిమ్మల్నే టిక్కెట్...." మళ్లీ అన్నాడు టి.టి.ఐ. చిరాగ్గా.

తడబాటుగా లేచి నిల్చుని "నేను ఎ.పి.పి. గారి బావమరిది నండి" అన్నాను. గొంతు వణుకుతూంటే.

పెట్టెలో వున్న ఆడ మగా ఘొల్లున నవ్వారు.

"రాస్కెల్ దిగు" బండి కదులుతూంటే అతను నిర్దాక్షిణ్యంగా నా మెడమీదచెయ్యేసి క్రిందికి నెట్టాడు.

రెండు నిమిషాల్లో తేరుకుని కానిస్టేబుల్ దొరక్కపోతాడా అనే ధైర్యంతో మరో పెట్టెలో ఎక్కాను.

రైలు నడుస్తూంది నా గుండె కొట్టుకుంటూంది.

విజయనగరం స్టేషను వస్తూంది. మళ్లీ ఇందాక నన్ను సన్మానించి రైలు దింపిన టి.టి.ఐ. నా ముందు ప్రత్యక్షమయ్యాడు.

"ఏం? అక్కడ దింపితే ఇక్కడ కూర్చున్నావా? నిన్ను వదలి లాభంలేదు డబ్బులు తియ్యి" అన్నాడు.


అతని వాలకంచూస్తే నామీదచెయ్యి చేసుకుంటాడని అనుమానం వచ్చింది. ఎ.పి.పి. గారి బామ్మరిదిననీ, కానిస్టేబుల్ నా విషయం మీకు చెబుతా డనుకున్నాననీ, ఏం చెప్పినా అతను వినే స్థితిలోలేడు. జేబులోవున్న పది రూపాయల కాయితం అతని చేతిలోపెట్టి రసీదు తీసుకుని వాల్తేరులో దిగి అక్కడికి నాలుగు ఫర్లాంగుదూరంలో వున్న మా అత్త గారింటికి నడిచిపోయాను.

నాకు కానిస్టేబుల్‌మీద, మా బావగారిమీద, పెళ్లి చేసిన అమ్మమీద, పండక్కి రమ్మని వ్రాసిన మామగారిమీద ఎందుకో చాలా కోపంగా వుంది.

నే నింట్లోకి వెళ్లేసరికి ముందుగా కనిపించింది నా భార్యే! కనీసం మంచినీళ్లన్నా ఇవ్వకుండా 'పువ్వు లేవండీ....!' అని అడిగింది.

అంతే! ఆమె చెంప ఛెళ్లమనిపించాను.

తెల్లబోయి బిత్తర చూపులు చూస్తూ గుడ్ల నీరు కుక్కుకుంటూ "నేనేం చేశానండీ!" అంది. నిజమే తానేం చేసింది కనుక?





ఆ రాత్రి ఆమెను ప్రసన్నం చేసుకోవటానికి తలప్రాణం తోకకి వచ్చింది. మామగారు "సుఖంగా ప్రయాణం జరిగిందా?' అని వేసిన కుశలప్రశ్నకు వెకిలినవ్వు నవ్వాను.

మరెప్పుడూ మా బావగారి రికమెండేషను మీద నేను రైలెక్కలేదు. ఈ ప్రయాణం విషయం ఎవరికీ చెప్పలేదు. ఈ పాతిక ముప్ఫయి సంవత్సరాల్లో ఆర్థికవ్యవస్థ ఎంత అస్తవ్యస్తమైంది? మామగారు అల్లుణ్ణి పిలవటానికి జంకు. అతిధివస్తే భయపడటం, అప్పటిరోజుల్లో లేదు. జనాభా పెరుగుదలతో పాటు నిరుద్యోగం, వరకట్న దురాచారం మన అభివృద్ధిని కుంటుపరుస్తున్నాయి. ఎప్పుడో తన తండ్రిలా నేను అల్లుడి ముద్దు ముచ్చటలు జరపాలంటే నాకు సాధ్యమా! అప్పటి ఆర్థిక పరిస్థితులువేరు. మామగారికి వెనుక ఆస్తులుండేవి. ఇప్పుడు ఆస్తులున్న వాళ్ళెంతమంది వున్నారు?

ఈ వుత్తరం అందుకుని అల్లుడు అమ్మాయి వచ్చేస్తే! నా గుండె భయంతో కొట్టుకుంది. బట్టలు మార్చుకుని ఉత్తరం పోస్టుచెయ్యటానికి వెళ్తున్న మా చిన్నవాణ్ణి పిలిచాను. వాడి చేతిలో కార్డు అందుకుని చింపి పారేస్తూ "అమ్మకి చెప్పకు" అన్నాను.

వాడు నవ్వుకుని మళ్ళీ ఇంట్లోకి వెళ్లబోతే వెనక్కి పిలిచి, "వీధిలోకి వెళ్లివచ్చి అమ్మకి వుత్తరం పోస్టు చేశానని చెప్పు" అన్నాను వాడి చెవిలో, వాడు నవ్వి అలానే చేశాడు.

పండగ దగ్గరయిన దగ్గరనుంచీ, అల్లుడు వస్తాడు అమ్మాయి వస్తుంది అవి తేవాలి ఇవి తేవాలి అని మా ఆవిడ ఒకటే హడావుడి పడిపోసాగింది.

అప్పటిదాకా ఎంతో గుట్టుగా మెసులుకున్న మా చిన్నవాడు, "ఒరే చిన్నా కొట్టుకు వెళ్లి శనగపప్పు, మైదా, పంచదార, నెయ్యి" అని మా ఆవిడ ఏకరువు పెడుతూంటే...." మనకే గదా, పరవాన్నమో వండేద్దూ. వాడు సామాన్లడిగితే విసుక్కుంటున్నాడు, పాత బాకీ తీర్చలేదని" అని లీలగా బయటపడిపోయాడు.

ఆవిడ కప్పున లేచింది. "ఉత్తరం వ్రాయాలే కాని అతను (అల్లుడు) అలాటి వాడుకాదు. విధిగా వస్తాడు. పట్రా సామాన్లు సాయంత్రం దీపాలకి ఓ కేజీ నూనె కూడా పట్టుకురా. వెళ్ళు" అని.

వాడికి వళ్లు మండిందిలాగుంది. "డబ్బు లేని పరిస్థితిలో పండుగలేమిటి? కేజీ నూనె దీపాలు వెలిగించే రోజులు కావు. అయినా అక్కా బావ రారు. నాన్న ఉత్తరం చింపి పారేశారు" అన్నాడు పుసుక్కున.

"హయ్యో హయ్యో ఇలాటి పాడుబుద్ధు లెందుకు పుడుతున్నాయిరా మీకు! పండగకి రమ్మని ఉత్తరం వ్రాసి చింపుకుంటారురా! ఏదీ ఆయన్ని ఇలా పిలువు" అంది ఖంగున మా ఆవిడ.

ఉన్న పళాన్ని వీధిలోకి వెళ్లిపోవాలనుకున్నాను, కాని లుంగీగుడ్డ చుట్టపెట్టుకుని వీధి గడపలోకూర్చున్న నేనుఎక్కడికివెళ్లగలను?

మా చిన్నవాడు పెదవులు విడీ విడనట్లు నవ్వుకుంటూ "నాన్నా కాస్సేపు ఎటన్నా వెళ్లిపోండినాన్నా" అన్నాడు.

వాడిమీద కోపం వచ్చింది నాకు. 'వెధవా? చిన్న అబద్ధం ఆడలేనివాడివి ఎలా బతుకుతావురా? రేపొద్దుట ఉద్యోగం చేసేప్పుడు ఎంత గుట్టుగా వుండాలి? బుద్ధి లేదురా' అని వాణ్ని మెత్తగా చీవాట్లేశాను.

నేను వెళ్ళేదాకా ఆగలేదు మా ఆవిడ. సరాసరిన వీధి గడపలోకి వచ్చేసింది. 'హవ్వ హవ్వ'అని దవడలు నొక్కుకుంటూ.'శుభమా అని పిల్లని పండక్కి రమ్మని ఉత్తరం వ్రాసి చింపుకుంటామటండీ!' అంది అది మొదటి ప్రశ్నలా.

మొదటిరోజులో మొగ్గలా భర్తలదగ్గర ముడుచుకుపోతూ సిగ్గుపడే ఈ ఆడవాళ్లు క్రమంగా పెత్తనం చేతుల్లోకి తీసుకుని, భర్త అనేవాణ్ణి పిల్లాడికన్నా కనాకష్టంగా యెలా చూస్తారు చెప్మా అని ఆలోచిస్తున్నాను.

"అదేమిటండీ బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడరూ? ఏమిటి ఆలోచిస్తున్నారు" అంది మా ఆవిడ.

ఆమె నోరు చప్పున కట్టించెయ్యాలని "వాడుత్తనే అబద్ధమాడేడే సీతాలూ. పండక్కి రమ్మని ఉత్తరం వ్రాసి చింపి పారేస్తానా? నాకు బుద్ధిలేదూ!" అని నవ్వేసి 'ఏరా చిన్నా! నిజం చెప్పరా బాబూ!' అన్నాను వాణ్ని హెచ్చరిస్తున్నట్లు.

వాడు గ్రహించాడు. 'నువ్వు ఎలా తిడతావో అని అబద్ధమాడానమ్మా' అని నవ్వేసి, వాళ్లమ్మ చెప్పిన సామాన్లు తేవటంకోసం సంచి బుజాన వేసుకుని వెళ్లిపోయాడు.

ఈ పండక్కి అల్లుడు అమ్మాయి రారు. కనీసం ఎంత లేదన్నా. కార్డుముక్క చింపటం వలన రెండువందల రూపాయల ఖర్చు మిగిలింది. అని రిలీఫ్ ఫీలవుతున్నాను.

తెల్లవారితే దీపావళి పండగ. వీధిలో యెటెటో తిరిగి మైనపువత్తి తేవటం మరచిపోతే, మా ఆవిడ గొడవపెడుతుందని, మనవలు లేరు కనుక కాల్చే చిన్నపిల్లలు ఇంట్లో ప్రస్తుతానికి లేరు కనుకా, మరే ఇతర సామానులూ కొనకుండా, మైనపువత్తి కొని సంచిలో వేసుకుని రాత్రి ఏడుగంటలకే ఇంటికి వచ్చాను.

చెప్పులు విప్పుతుంటే, ఇంట్లోంచి యెవరివో గలగలా మాటలు వినిపించాయి.

ఎవరు చెప్మా అనుకొంటూ లోపలికి అడుగుపెట్టాను.

మా అమ్మాయి అనసూయ, అల్లుడు ప్రభాకరం. మనవలు చిట్టి, బుజ్జి.

'కలా! నిజమా! పిలుపు లేకపోయినా వచ్చేశారా?' అనే ఆశ్చర్యం నుంచి ఇంకా నేను కోలుకోనే లేదు.

అమ్మాయి చెబుతూంది. మీ ముందుగా భర్తకు తెలియకుండా నాకు కనుసౌంజ్ఞచేసి "మీరు వ్రాసిన ఉత్తరం బుజ్జి చింపేసింది నాన్నా! చూడండి. మీ నాన్న పండగకి రమ్మని ఉత్తరం వ్రాయలేదంటారు మీ అల్లుడు" అని.

"హయ్యో. వ్రాశానోయ్. వ్రాయనూ!" అని వెకిలినవ్వు నవ్వాను, అదే పలకరింపుగా అల్లుడివైపు చూస్తూ. *